**కథ**

# పబ్లిసిటీ

**హైదరాబాద్‌లోని ఒక పోలీస్ స్టేషన్.**

**సాయంత్రం నాలుగు గంటలకు ఫోన్ మోగింది. ఇన్‌స్పెక్టర్ నాయక్ అందుకున్నాడు.**

**"సార్... అది పోలీస్టేషనేనా?" వినిపించింది అవతలి కంఠం.**

**"యస్.." దర్పంగా అన్నాడు నాయక్.**

''సార్..నేను అమీర్‌పేట నుంచి మాట్లాడుతున్నాను. ఇక్కడ చిత్రాంగి అపార్ట్‌మెంట్స్‌లో నాలుగో అంతస్తు నాలుగొందల నాలుగు ఫ్లాట్‌లో వ్యభిచారం జోరుగా సాగుతున్నది. దాదాపు డజను మంది యువతులున్నారు. రోజంతా విటుల రాకపోకలతో మిగిలిన ఫ్లాట్స్ వారికి చాలా డిస్ట్రబెన్స్‌గా ఉంది. చాలా కాస్ట్లీ జనం వస్తున్నారు. దయచేసి మీరు రెయిడ్ చెయ్యాలి. మామూలు కుటుంబాల ఆడపిల్లలు ఫ్లాట్స్ బయటకొస్తే వాళ్ళు కూడా వ్యభిచారులేనేమో అని విటులంతా వారి వెంటబడుతున్నారు. ఎలాగైనా మీరు రెయిడ్ చెయ్యాలి'' అవతలి వ్యక్తి చెబుతున్నాడు.

''ఆల్‌రైట్..మీరెవరు? మీ అడ్రస్ చెప్పండి'' ఉత్కంఠగా అడిగాడు నాయక్.

''చిత్రాంగి అపార్ట్‌మెంట్స్, ఫోర్త్‌ఫ్లోర్, ఫ్లాట్ నెంబర్ ఫోర్‌నాట్ ఫోర్. తప్పకుండా రెయిడ్ చెయ్యాలి''

''ష్యూర్..ఇంతకూ మీరెవరు? ఎక్కడి నుంచి మాట్లాడుతున్నారు?''

''చిత్రాంగి..ఫోర్త్‌ఫ్లోర్..ఫోర్‌నాట్ ఫోర్..'' రిపీట్ చేసి పెట్టాడవతలి వ్యక్తి.

''షిట్..'' నుదురు రుద్దుకున్నాడు నాయక్.

సిగరెట్ వెలిగించి ఆలోచించసాగాడు.

తను సర్వీస్‌లో చేరిన తరువాత ఇలాంటి కేసులు ఎన్నెన్నింటినో చూశాడు. ఎన్నో జూదశాలలను, బ్రోతల్ హౌసులను మూయించాడు. కానీ ఏం లాభం? మూయించిన మూడో రోజునే తెరుచుకునేవి. ఇలాంటి కేసులు అంత ఆషామాషీవి కావని, వీటి వెనుక పెద్ద పెద్ద తలకాయలుంటాయని త్వరలోనే అర్థమైంది. వీటిని అరికట్టడం సులభమైన విషయం కాదని గ్రహింపుకొచ్చింది.

ఎప్పుడైనా ఏదైనా వ్యభిచార గృహం మీద దాడి చేసి దొరికిన వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చిన రెండు నిముషాలకే బడాబడా రాజకీయ నాయకుల నుంచే కాక తమ డిపార్ట్‌మెంట్‌లోని అత్యున్నతాధికారుల నుంచి కూడా ఫోన్లు వచ్చేవి. అరెస్టు చేసిన వారిని విడిచిపెట్టమనేది వాటిలోని సారాంశం. ఒత్తిడికి తలొగ్గకపోతే మర్నాడే ట్రాన్స్‌ఫర్! తాను ఎన్నిసార్లు ప్రయత్నించినా ఒక్క బ్రోతల్ హౌసును కూడా శాశ్వతంగా మూయించలేకపోయాడు.

సిగరెట్ పూర్తిగా కాలి వేళ్ళు చుర్రుమన్న తరువాత ఈ లోకంలోకి వచ్చాడు నాయక్.

ఎస్సై రాజును పిలిచాడు. విషయమంతా చెప్పాడు.

''ఈ ఆకాశరామన్నలు చెప్పేది నిజమేనంటారా'' నవ్వుతూ అన్నాడు రాజు.

''నిజమైనా అబద్ధమైనా ఎంక్వయిరీ చెయ్యవలసిన బాధ్యత మనమీదున్నది. చిత్రాంగి అపార్ట్‌మెంట్ ఎక్కడుంది?''

''అది చాలా పోష్ లొకాలిటీలో ఉంది సార్. చాలా రిచ్ మాత్రమే ఆ ఏరియాలో ఉండగలరు. వి.ఐ.పిలు చాలామంది ఆ అపార్ట్‌మెంట్స్‌లో ఉన్నారు. ఒక అజ్ఞాత వ్యక్తి టెలిఫోన్ కాల్‌ను నమ్మి మనం రెయిడ్ చెయ్యడం అంత మంచిది కాదు''

''యూ ఆర్ రైట్. అందుకే ఒక ప్లాన్ చెబుతున్నాను. నువ్వు, మరో కానిస్టేబుల్ మఫ్టీలో వెళ్ళండి. ఒక గంట పాటు ఆ ఫ్లాట్‌లోకి ఎవరెవరు వెళ్తున్నారో గమనించండి. అనుమానం ఏమాత్రం వచ్చినా మీరు కూడా విటుల మాదిరే వెళ్ళండి. అక్కడ వ్యభిచారం జరుగుతున్నదని ధృవపడితే వెంటనే అందరినీ అరెస్ట్ చెయ్యండి.''

''యస్సర్. రజాక్‌ను తీసుకెళ్తాను''

''రైట్..కానీ ఒక విషయం''

''ఏమిటి సార్?''

''అక్కడకు వెళ్ళేంతవరకు రజాక్‌కు కూడా ఈ విషయం తెలియకూడదు. తెలిస్తే నీదే బాధ్యత''

''ష్యూర్ సర్'' సెల్యూట్ చేశాడు రాజు.

రాత్రి ఏడు గంటలకు రజాక్‌ను తీసుకుని జీప్‌లో బయల్దేరాడు రాజు. పది నిముషాలలో చిత్రాంగి అపార్ట్‌మెంట్స్ చేరాడు. జీపును దూరంగా పార్క్ చేశాడు.

''ఏం రజాక్... ఆ అపార్ట్‌మెంట్స్‌లో ఒక బ్రోతల్ కొంప ఉంది. మంచి మంచి అందగత్తెలున్నారు. కాసేపు ఓ చూపు చూస్తే ఎలా ఉంటుంది? హైగా మఫ్టీలోనే ఉన్నాం'' నవ్వుతూ కన్నుగొట్టాడు రాజు.

రజాక్‌కు ఎక్కడో షాక్ తగిలింది. ఒళ్ళంతా జిల్లుమంది. తను ఆ ఏరియాలో పోలీసుద్యోగం చేస్తున్నా అక్కడ ఓ బ్రోతల్ హౌస్ ఉన్నట్లు తన కింతవరకూ తెలియదు. అంటే వాళ్ళు మామూలు కానిస్టేబుళ్ళతోకాక నేరుగా అధికారులతోనే సంబంధాలు పెట్టుకున్నారన్నమాట!

''సార్... అక్కడలాంటి కొంప ఉన్నదా? నేనింతవరకూ వినలేదు. ఆ ఫ్లాట్స్‌లో చాలా పెద్ద పెద్దోళ్ళుంటారు. అటువంటి వాళ్ళమధ్యన..'' నరాలు పురెక్కుతున్నాయి రజాక్‌కు.

''ఇది హైటెక్ యుగం. గదిలోంచి కదలకుండా ప్రపంచాన్ని చూసే రోజులు. మనం జాగ్రత్తగా రెయిడ్ చెయ్యాలి'' చెప్పాడు రాజు.

రెయిడ్ అన్నమాట వినగానే ఉత్సాహం చల్లారిపోయింది రజాక్‌కు. బయట తిరుగుళ్ళు తిరగడం రజాక్‌కు బాగా అలవాటు. తను పనిచేస్తున్న ఏరియాలలోని అందరు ప్రాస్టిట్యూట్స్ తనకు తెలుసు. తన ఉద్యోగం పేరు చెప్పి అందరినీ బెదిరించి కోరికలు తీర్చుకునే వాడు. కానీ ఇంత హైక్లాస్ వారిని ఎపుడూ అనుభవించి ఎరుగడు. భలే మంచి ఛాన్సు అని సంబరపడ్డ రజాక్‌కు రెయిడ్ అనే మాట అశనిపాతంలా తగిలింది. తాను తొందరపడి నోరు జారనందుకు, యస్సై ముందు చులకన కానందుకు అభినందించుకున్నాడు.

''నువ్వు నాకు పది అడుగుల దూరంలో ఉండు. నేను ఫ్లాట్‌లోకి వెళ్తాను. అవసరమైతే విజిల్ వేస్తాను. వెంటనే నువ్వు లోపలకు రా'' చెప్పాడు రాజు.

''యస్సర్..'' వినయంగా అన్నాడు రజాక్.

చిత్రాంగి కాంప్లెక్స్‌లోకి ప్రవేశించాడు రాజు. దాన్లో ఐదు అంతస్తులలో ఇరవై ఫ్లాట్స్ ఉన్నాయి. ఆ నిర్మాణం చూస్తే అవి కోటీశ్వరులకు తప్ప సామాన్యులకు ఏమాత్రం అందుబాటులోనివి కావని ఈజీగా అర్థమౌతుంది. గ్రౌండ్ ఫ్లోరింగ్ కూడా మార్బుల్‌తో వేశారు.

రాజును చూడగానే వాచ్‌మన్ వచ్చాడు.

''ఎవరు కావాలి సార్?'' అడిగాడు.

''ఫ్లాట్ నంబర్ ఫోర్ నాట్ ఫోర్''

''మీరెవరు''

''వాళ్ళు మా వాళ్ళే గుంటూరు నుంచి వచ్చారు''

''ఒక్క నిముషం'' ఇంటర్‌కమ్‌లో బటన్ను నొక్కాడు వాచ్‌మెన్.

''సార్. మీ పేరు అడుగుతున్నారు'' అన్నాడు వాచ్‌మెన్.

''యశ్వంత్ కుమార్. ఫేమస్ ఇండస్ట్రియలిస్ట్ జగన్మోహనరావుగారబ్బాయిని'' చెప్పాడు రాజు.

ఇంటర్‌కమ్‌లో చెప్పాడు వాచ్‌మెన్.

''సార్ మీరు వెళ్ళొచ్చు. అక్కడ లిఫ్టుంది'' మాట్లాడిన తరువాత చెప్పాడు వాచ్‌మన్.

''థాంక్స్..'' పది రూపాయల నోటు అతని చేతిలో ఉంచి చేతి గాలిలోకి విదిలించి ముందుకు నడిచాడు రాజు.

విజానికది చేయి విదిలించడం కాదు, 'మున్నా కూడా అలాగే పేర్లు మార్చి లోపలకు ప్రవేశించ'మని దూరానున్న రజాక్‌కు ఇచ్చిన సైగ. ఇలాంటివి ఆ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే కొంతమందికి మాత్రమే అర్థమౌతాయి.

కార్ పార్కింగ్‌లో ఐదారుకార్లున్నాయి. రెండు మోటార్ సైకిళ్లున్నాయి. లిఫ్టులోకి వెళ్ళకుండా మెట్లవెంబడే పైకి వెళ్ళసాగాడు రాజు. ఇరవై ఫ్లాట్స్‌లో దాదాపు పది ఫ్లాట్స్ ఖాళీగా ఉన్నాయి. ఆక్రమించబడ్డ ఫ్లాట్స్‌లో కూడా అన్నీ తలుపులు మూసే ఉన్నాయి. అంతా హైక్లాస్ కదా! ఎవరి ప్రపంచం వారిది. అక్కడ మరో పాతికేళ్ళున్నా వారికి కనీసం పక్కనున్న ఫ్లాట్‌లో ఎవరుంటారో కూడా తెలియదు.

ఫోర్ నాట్ ఫోర్ ఫ్లాట్ వద్దకు వచ్చాడు రాజు. రెండు నిముషాల తరవాత రజాక్ కూడా వచ్చాడు. దూరంగా నిలుచున్నాడు.


కాలింగ్‌బెల్ నొక్కాడు రాజు. నిముషం తరువాత పంజాబీ డ్రెస్ ధరించిన నలభయ్యేళ్ళ ప్రౌఢ మెల్లగా తలుపు తెరిచింది.

''వాడ్డూయూ వాంట్'' అడిగింది నవ్వుతూ.

''అయామ్ యశ్వంత్ ఫ్రమ్ గుంటూర్. బిజినెస్ పని మీద వచ్చాను. వాంట్ గుడ్ కంపెనీ'' నవ్వుతూ చెప్పాడు రాజు.

రాజును ఎగాదిగా చూసిందామె.

మెడలో స్టైల్‌గా వేలాడుతున్న రెండు గోల్డ్ ఛైన్లు, రెండు చేతుల మణికట్ల మీద ధగధగ మెరుస్తున్న బ్రేస్‌లెట్స్, ఆకర్షణీయమైన పర్సనాలిటీ, ఎత్తుగా ఉన్న జేబు ఆమెను ఆకర్షించాయి.



''ఇక్కడలాంటివి దొరుకుతాయని ఎవరు చెప్పారు? ఇక్కడుండేవి రెస్పెక్టబుల్ ఫ్యామిలీస్..'' కొంచెం కోపంగా చెప్పిందామె.

''మా కంపెనీలో పనిచేసే ఎగ్జిక్యూటివ్ చెప్పాడు. నేను పొరపాటున రాంగ్ అడ్రస్‌కు వచ్చానేమో. అయామ్ ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ..ప్లీజ్ ఫర్గివ్ మీ మేడమ్'' గిరుక్కున వెనక్కు తిరిగాడు రాజు.

''హలో..జస్ట్‌మినిట్..'' పిలిచిందామె.

''సారీ చెప్పానుగా..ఇమ్మీడియెట్‌గా మా ఎగ్జిక్యూటివ్‌ను డిస్మిస్ చెయ్యాలి. లెట్ మీ గో ప్లీజ్..'' ప్రాధేయపూర్వకంగా అన్నాడు రాజు.

''ప్లీజ్ కమ్..'' అన్నదామె.

దగ్గరకు వెళ్ళాడు రాజు. ''మీ ఎగ్జిక్యూటివ్‌ను ఏమీ చెయ్యకండి. మీకు కంపెనీ దొరుకుతుంది'' తలుపు తీసిందామె.

''థేంక్యూ'' లోపలికెళ్ళాడు రాజు. జేబులో ఎత్తుగా కనిపిస్తున్న రివాల్వర్‌ను గట్టిగా పట్టుకున్నాడు.

''జాస్మిన్, షకీలా, జూలియా..'' అంటూ ఐదారు పేర్లను పిలిచింది.

మంచి యవ్వనంలో ఉన్న ఐదుగురు యువతులు బిలబిల గదుల్లోంచి బయటకొచ్చారు. సాధారణ అందగత్తెలే అయినా మేకప్‌లో మెరిసిపోతున్నారు. అందరూ నవ్వుతున్నారు.

వారందరి రేట్లు చెప్పింది ప్రౌఢ. రెండు వేల నుంచి ఐదు వేల వరకూ ఉన్నాయి.

ముఖాన్ని అసంతృప్తిగా పెట్టాడు రాజు.

''ఊహు..సినిమా వాళ్ళు కావాలి''

ఇలపావులూరి మురళీమోహన్‌రావు

అన్నాడు.

''జూనియర్ ఆర్టిస్టులు కొంతమంది ఉన్నారు. రేటు మినిమమ్ అయిదు వేలుంటుంది'' చెప్పింది ప్రౌఢ.

''డామిట్..బ్లడీ కరెన్సీ..' జేబులోంచి పది వేల రూపాయల కట్టతీసి నిర్లక్ష్యంగా టీపాయ్‌మీద పడేశాడు రాజు.

ప్రౌఢ కళ్ళు విశాలమయ్యాయి.

ఒక గదిలోకి వెళ్ళి ఇద్దరు యువతులను బయటకు తెచ్చింది. చిన్న చిన్న వేషాలలో రెండు మూడు సినిమాలలో, టీవీ వారిని ఇంతకు ముందు చూశాడు రాజు.

''రేపో ఎల్లుండో వీరు హీరోయిన్లవుతారు. అప్పుడు ఇలాంటి కట్టలు పది ఇచ్చినా దొరకరు'' పెద్దగా నవ్వింది ప్రౌఢ.

''బ్యూటిఫుల్..మరి పోలీస్ రెయిడ్స్ జరిగితే..'' సందేహం నటించాడు రాజు.

విరగబడి నవ్వింది ప్రౌఢ.

''ఇక్కడకు వచ్చేది ఎలాంటివారో తెలుసా? ఒక్కొక్కడు గవర్నమెంట్‌నే పడగొట్టగలడు. డోంట్ వర్రీ. ఎంజాయ్ యువర్ సెల్ఫ్'' అన్నది.

''మీ దగ్గర ఇంకా ఉన్నారా' అడిగాడు రాజు.

''నీకు ఎంతమంది కావాలయ్యా మహానుభావా? ఇంకా నలుగురున్నా.. బట్ దే ఆర్ ఎంగేజ్డ్'' గదులవంక చూపిస్తు చెప్పింది ప్రౌఢ.

''గుడ్'' అని విజిల్‌వేశాడు రాజు.

క్షణంలో ప్రత్యక్షమయ్యాడు రజాక్. అతని చేతిలో రివాల్వర్ మెరుస్తున్నది

''హూ ఆర్యూ? మీరు రౌడీలా? కిడ్నాపర్లా?'' కంగారుగా అరిచింది ప్రౌఢ.

''వియార్ పోలీస్..వ్యభిచారం నిర్వహిస్తున్నందుకు ఇమ్మోరల్ ట్రాఫిక్ ప్రివెన్షన్ యాక్ట్ 1956 కింది మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాం. గొడవ చెయ్యకుండా పోలీస్ స్టేషనుకు నడవండి'' ఉరిమాడు రాజు.

''పోలీస్..పోలీస్..'' భయంగా అరిచింది ప్రౌఢ.

రాజు, రజాక్ గదుల తలుపులు తట్టారు. తలుపులు తెరుచుకున్నాయి. నాలుగు జంటలు కలుగుల్లోంచి ఎలుకలు బయటకొచ్చినట్లు గడగడలాడుతూ బయటకొచ్చి తలలు దించుకున్నాయి.

''కమాన్..మూవ్..'' అరిచాడు రాజు.

మెట్లు దిగుతూ ఇతర ఫ్లాట్ల వంక చూశాడు రాజు. ఇందాక ఎలా ఉన్నదో ఇప్పుడూ వాతావరణం అలాగే ఉన్నది. పక్కనే ఇంత గోల జరుగుతున్నా ఒక్కరు కూడా తలుపు తెరిచి చూడలేదు.

నవ్వుకున్నాడు రాజు.

అందర్నీ జీపులో కుక్కి- పోలీస్ స్టేషనుకు తీసుకొచ్చాడు రాజు. ఇన్‌స్పెక్టర్ నాయక్‌కు ఫోన్ చేశాడు. పత్రికా విలేకరులను పిలిపించమని, తాను పది నిముషాలలో వస్తున్నానని చెప్పాడు నాయక్.

పదిహేను నిముషాలలో ఇదారుగురు విలేకరులు, వారి వెనకాలే నాయక్ వచ్చారు.

వ్యభిచారిణులను, విటులను ఒక పక్క నిలబెట్టారు. వాళ్ళను ఫొటోలు తీశారు.

తమకు ఒక అజ్ఞాతవ్యక్తి సమాచారం అందించిన విషయం, ఆ రాకెట్‌ను ఛేదించడానికి తాము పన్నిన వ్యూహం, అమలు పరచిన వైనం పూసగుచ్చినట్లు విలేకరులకు వివరించాడు నాయక్.

తరువాత పోలీస్ కమీషనర్‌కు ఫోన్ చేసి చెప్పాడు. నాయక్‌ను, అతని సహచరులను అభినందించి నిందితులనందరిని కోర్టుకు రిమాండ్ చెయ్యమని ఆదేశించాడు కమీషనర్.

''సార్..వీళ్ళను కోర్టుకు రిమాండ్ చేస్తే తలా ఒక వంద రూపాయలు ఫైన్ చేసి వదిలేస్తారు. ఏం లాభం?'' అన్నాడు రాజు.

''మరేం చేద్దామంటావు?'' నవ్వాడు నాయక్.

''మళ్ళీ జన్మలో ఇటువంటి పనులు చెయ్యకుండా మనం మర్యాదలు చేద్దాం'' అన్నాడు రాజు లాఠీ ఊపుతూ.

''డోన్ట్ బి ఓవర్ స్మార్ట్..మనం చట్టప్రకారం పని చెయ్యాలి. వీళ్ళందర్నీ లాకప్‌లో పడెయ్'' చెప్పాడు నాయక్.

మర్నాడు అన్ని దినపత్రికలలో తాటికాయంత హెడ్డింగ్స్‌తో వార్త వచ్చింది.

''నగరం నడిబొడ్డున జోరుగా వ్యభిచారం!''

''నగరంలో హైటెక్ వ్యభిచారం''

''హైటెక్ ప్రాస్టిట్యూషన్ రాకెట్ ఇన్ సిటీ''

''కోట్లు వ్యాపారంలో సినీ ఆర్టిస్టులు!''

ఇలా రకరకాల హెడ్డింగ్స్‌తో వ్యభిచారిణుల పేర్లు సహా తమ కవిత్వాన్ని కొంత కలిపి మసాలా వ్యాసాలు రాశారు విలేకరులు.




ఆ ప్రాంత ప్రజలు పోలీసులను అభినందించారు.

మర్నాడు అందరినీ కోర్టులో ప్రవేశపెట్టారు పోలీసులు.

అందరికీ తలా వంద రూపాయలు జరిమానా విధించి 'శిక్షించింది' న్యాయస్థానం.

★ ★ ★

రెండు రోజుల తరువాత నగరంలోని ఒక ప్రముఖ రాజకీయ నాయకుడికి ఫోన్ చేసింది ప్రౌఢ.

''థాంక్యూ వెరీమచ్ సార్. మీ ప్లాన్ అమోఘం. మీ బుర్ర పాదరసం. ఒక్కొక్కళ్ళనీ నెలకు పదిహేను వేల రూపాయల కాంట్రాక్టుకి మూడు నెలల క్రితం తెచ్చాం. ఎవ్వరికీ చెప్పుకోలేని వ్యాపారం. మా విషయం ఎవరికీ తెలియక, కస్టమర్స్ రాక దాదాపు దివాలాతీశాం.

ఈ సమయంలో మీరు చెప్పినట్లే మా ఏజెంట్‌తో పోలీసులకు ఫోన్ చేయించాను. అనుకున్నట్లే ఆ రాత్రే పోలీసులు రెయిడ్ చేశారు. వాళ్ళొచ్చేసరికి ఇద్దరు జూనియర్ ఆర్టిస్టులను కూడా తెప్పించి మా వాళ్ళనే కస్టమర్స్‌గా లోపలుంచాను.

ఒక రోజు లాకప్‌లో ఉంచితే ఉంచారుకానీ మా వ్యాపార విషయం సిటీ అంతా తెలిసిపోయింది. నయాపైసా ఖర్చు కాకుండా బోలెడంత పబ్లిసిటీ లభించింది. నిన్నటి నుంచీ కస్టమర్లు వరదలా వస్తున్నారు.

అడ్వాన్సు బుకింగులు కూడా అవుతున్నాయి. త్వరలో బాంబే నుంచి మరికొంతమంది గర్ల్స్‌ను తెప్పిస్తాం. మీ ఋణం తీర్చుకుంటాను. కానీ ఈసారి ఎవరైనా రెయిడింగని వస్తే....''

''డోన్ట్‌వర్రీ డియర్..నక్సలైట్ ఏరియాలో పోస్టింగిప్పిస్తాలే'' పెద్దగా నవ్వింది అవతలి కంఠం.

''సార్..చిన్న రిక్వెస్టు. మా ఏజెంటు ఒకతను బంజారాహిల్స్‌లో వీడియో లైబ్రరీ పెట్టాడు. దాదాపు వెయ్యి బి.యఫ్. సీడీలున్నాయతని దగ్గర. షాప్ డీసెంటుగా ఉండటం వల్ల కస్టమర్స్ వాటిని అడగడానికి భయపడుతున్నారు. పైగా అలాంటివి ఆ షాపులో ఉండవనుకుంటున్నారు.

దయచేసి మీరు ఎలాగైనా రేపు అతని షాపుమీద రెయిడింగ్ చేయించాలి. పోలీసులు పట్టుకోవడానికి వీలుగా పది సీడీలుంచమని చెబుతాను. అతని దగ్గర అలాంటి సీడీలున్నట్లు పదిమందికీ తెలిస్తే అతని బిజినెస్ కూడా వర్ధిల్లుతుంది. ప్లీజ్..'' నవ్వుతూ ఫోన్ పెట్టేసింది ప్రౌఢ.

✪